# కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2025-26 వార్షిక బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అధికార బీజేపీ బడ్జెట్ చారిత్రాత్మకమైనదని చెబుతుండగా, విపక్షాలు మాత్రం పెదవి విరిచాయి. తెలంగాణకు బడ్జెట్‌లో మొండిచేయి చూపారని బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు అంటుండగా, బీజేపీ నేతలు సంబురాలు జరుపుకుంటున్నారు. బడ్జెట్‌పై వివిధ పార్టీల నేతలు, ప్రజల అభిప్రాయాలివీ...

\- ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం

### తెలంగాణపై సవతితల్లి ప్రేమ ప్రదర్శించిన మోదీ



కేంద్ర వార్షిక బడ్జెట్‌లో తెలంగాణకు నిధుల కేటాయింపులో ప్రధాని మోదీ సవతితల్లి ప్రేమ ప్రదర్శించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం వాటాల ప్రకారం అన్ని రాష్ట్రాలకు సమానంగా నిధులు కేటాయించి తెలంగాణకు మొండిచేయి చూపారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారు. రాష్ట్రానికి నిధులు తేవడంతో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారు.

\- ముఠా గోపాల్, ముషీరాబాద్ ఎమ్మెల్యే

### పేద, మధ్యతరగతి వర్గాల అనుకూల బడ్జెట్



ఇది పేద, మధ్యతరగతి వర్గాలకు అనుకూల మైన బడ్జెట్. ఉద్యోగులకు కూడా అధిక ప్రాధాన్యం ఇచ్చారు. రూ. 12 లక్షల వరకు పన్ను మినహా యింపు ఇవ్వడం చారిత్రాత్మకం. ప్రజల ఆర్థిక స్థితి గతుల మెరుగుకు ఈ బడ్జెట్ దోహద పడుతుంది. విద్యాభి వృద్ధికి తీసుకున్న నిర్ణయం భేష్. సంక్షేమ రంగాల అభివృద్ధి నవభారతానికి నాంది.

\- డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు

### తెలంగాణకు తీరని అన్యాయం



గతేడాది ఏపీకి కేంద్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించిన కేంద్రం.. నేడు బీహార్ రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌లో ఆ రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించింది. ప్రధాన మంత్రి మోదీ తెలంగాణ రాష్ట్రానికి మాత్రం నిధుల కేటాయింపులో మొండిచేయి చూపించి తీరని అన్యాయం చేశారు.

\- జీబీ శ్యామ్‌రావు, టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ చైర్మన్

### ఇది కేవలం ఏపీ, బిహార్ రాష్ట్రాల బడ్జెట్



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ దేశంలోని 28 రాష్ట్రాలది కాదు, కేవలం ఏపీ, బిహార్ రాష్ట్రాలది మాత్రమే. పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. ఏపీ, బీహార్ రాష్ట్రాల మాదిరిగా నిధులు కేటాయించకుండా తెలంగాణకు అన్యాయం చేశారు. దీనికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు నైతిక బాధ్యత వహించాలి. నిధులు సాధించడంలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా పూర్తిగా వైఫల్యం చెందారు.

\-కాలేరు వెంకటేశ్, అంబర్‌పేట ఎమ్మెల్యే

### 36 రకాల మందులపై ట్యాక్స్ మినహాయింపు సంతోషకరం



వార్షిక బడ్జెట్‌లో 36 రకాల ప్రాణదార మందులపై విదేశాల నుంచి దిగుమతి ట్యాక్స్ మినహాయింపు, క్యాన్సర్ మందులపై ట్యాక్స్ మినహాయింపు ఇవ్వడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే ఆదాయంపై టీడీఎస్ చార్జీ రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు లేకుండా మినహాయింపు ఇవ్వడం సీనియర్ సిటిజన్లకు ఊరట కల్పిస్తుంది.

\- కౌండిన్యప్రసాద్, మెడికల్ వ్యాపారి

### కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి రాజీనామా చేయాలి



రాష్ట్రానికి రాజ్యాంగపరంగా రావాల్సిన వాటా నిధులను కేంద్రం నుంచి తీసుకురావడంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ ఎంపీలు విఫలమయ్యారు. నైతిక బాధ్యత వహించి వారు రాజీనామాలు చేయాలి. ఇప్పటికైనా వారు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తెలంగాణకు న్యాయం చేయాలి.

\- ఎం.నాగేష్ ముదిరాజ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

## లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని పంచముఖ ఆంజనేయ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విష్ణుసహస్రనామ పారాయణం, స్వామివారిని పెళ్లికుమారుడిని, అమ్మవారిని పెండ్లికుమార్తెను చేయుడం, నివేదన, నీరాజనం, ధ్వజారోహణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మాధికారి జనార్ధనమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## మధురంగా త్యాగరాజస్వామి కీర్తనలు



రమాప్రభను సన్మానిస్తున్న మధుసూదనరావు తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అన్నమాచార్య సంకీర్తనలు సాహిత్య ప్రధానం కాగా త్యాగరాజ స్వామి కీర్తనలు సంగీత ప్రధానమని దూరదర్శన్ పూర్వ సంచాలకుడు డా. పి. మధుసూదనరావు అన్నారు. మహిళా సాంస్కృతిక సేవా సంస్థ రాగరాగిణి ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయగానసభలో సంస్థ 10వ వార్షికోత్సవం సందర్భంగా దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆంధ్రమహిళాసభ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చైర్‌పర్సన్ డా. వైరమాప్రభ బృందం త్యాగరాజస్వామి రచించిన పంచరత్న కీర్తనల గోష్టిగానంతో శ్రోతలను పరవశులను చేశారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా. మధుసూదనరావు శాలువా జ్ఞాపికతో రమాప్రభను సన్మానించి మాట్లాడారు. బోయి భీమన్న సాహిత్య నిధి అధ్యక్షురాలు హైమవతి భీమన్న అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రాగరాగిణి సంస్థ నిర్వాహకులు రమణకుమారి, సుబ్బలక్ష్మి, మైథిలి కిడాంబి తదితరులు పాల్గొన్నారు.



## బీఎస్‌ఏపై ఉచిత శిక్షణా తరగతులు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన క్రిమినల్ చట్టం భారతీయ సాక్ష్యా అధినీయం (బీఎస్ఏ) పై మార్చి 25 వరకు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్, సీబీఐ కోర్టు సీనియర్ న్యాయవాది కాశీంలు తెలిపారు. శనివారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, కొత్త క్రిమినల్ చట్టంపై యువ న్యాయవాదులకు పూర్తి అవగాహన ఉంటేనే కోర్టుల్లో క్రిమినల్ కేసులను సమర్థవంతంగా వాదించగలుగుతారని అన్నారు. ప్రతి శని, ఆదివారాలలో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జేఏసీ కార్యాలయంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణా తరగతులకు హాజర య్యే వారు 8885670270 ఫోన్ నెంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జేఏసీ నేతలు సుదర్శన్, భూపాల్‌రాజు, ఎ.సతీష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'సెబ్ ఏ బరాత్'కు ఇబ్బందులు లేకుండా చూడండి

● జెడ్సీకి బీఆర్ఎస్ మైనార్టీ నాయకుల వినతి

ముషీరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):ముస్లింలు పవిత్రంగా జరుపుకునే సెబ్ ఏ బరాత్ పండుగకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మసీదుల వద్ద ఏర్పాట్లు చేయాలని బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, ముషీరాబాద్ బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ పర్వేజ్, అక్లక్ హుస్సేన్ తదితరులు జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ (జెడ్సీ) రవికిరణ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ నెల 13న సెబ్ - ఏ బరాత్ నేపథ్యంలో ముస్లింలు మసీదులు వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారని, కావున మసీదుల వద్ద విద్యుత్, తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడటంతో పాటు పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆదేశాలతో తాము నియోజకవర్గంలోని 50 ప్రధాన మసీదులను సందర్శించి సమస్యలను తెలుసుకున్నామని ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు చెప్పారు.

## మార్కెట్‌లో కూల్చివేత వ్యర్థాల తరలింపు

నల్లకుంట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నల్లకుంటలోని కూరగాయల మార్కెట్ రోడ్డులో ఆక్రమణలను కూల్చివేయడం వల్ల పోగుపడ్డ వ్యర్థాలు, ఇతర సామగ్రిని జీహెచ్ఎంసీ సిబ్బంది శనివారం ఉదయం తరలించారు. ఫుట్‌పాత్‌తో పాటు రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన వ్యాపారులు ఏర్పాటు చేసిన 40 తాత్కాలిక షాపులు, 50 తోపుడు బండ్లను జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం కూల్చివేసిన విషయం తెలిసిందే. కాగా, కూల్చివేతల వల్ల రోడ్డుపై పోగుపడ్డ వ్యరాలు, ఇతర సామగ్రినిజీహెచ్ఎంసీ సిబ్బంది సుమారు 10 వాహనాలలో ఎత్తివేసి తరలించారు. ఆక్రమణలను తొలగించడం వల్ల మార్కెట్ రోడ్డు ప్రస్తుతం విశాలంగా మారింది.

### న్యాయం చేస్తాం: కార్పొరేటర్

బాధిత వ్యాపారులు శనివారం స్థానిక కార్పొరేటర్ యాకర అమృతను కలిశారు. జీహెచ్ఎంసీ కూల్చివేతల వల్ల తమ జీవనోపాధి కోల్పోయామని వాపోయారు. కూల్చివేతల్లో షాపులు, తోపుడు బండ్లు కోల్పోయిన వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఉపాధి అంశంపై చర్చించి న్యాయం చేస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

## కబడ్డీ క్రీడాకారుడు శివకుమార్‌యాదవ్ మృతికి పలువురి సంతాపం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ కబడ్డీ మాజీ క్రీడాకారుడు శివకుమార్‌యాదవ్ గుండె పోటుతో మృతి చెందారు. కాచిగూడ చప్పల్‌బజార్‌లోని ఆయన నివాసంలో పలువురు సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి, తలసాని సాయికిరణ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందకిషోర్‌యాదవ్‌లు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శనివారం రాంనగర్ సెయింట్‌పాయిస్ హైస్కూల్‌లో 66వ వార్షిక స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు.. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... క్రీడలు విద్యార్థుల్లో ఏకాగ్రత్త పెంపుతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ లిండా జరాల్డ్, ఎన్‌సీసీ అధికారి మేజర్ జయసుధ, మాజీ డిప్యూటీ డీఈఓ చిరంజీవి, ఇండియన్ అథ్లెటిక్ నందిని, కరస్పాండెంట్ నక్షత్ర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికను లైంగికంగా వేధిస్తున్న యువకుడిపై కేసు

బర్కత్‌పుర ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బాలికను లైంగికంగా వేధిస్తున్న ఓ యువకుడిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేటకు చెందిన బాలిక (13)ను కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే ఓ యువకుడు లైంగికంగా వేధిస్తున్నట్లు సీడబ్ల్యూసీ కోఆర్డినేటర్ మాధవికి సమాచారం అందించింది. వెంటనే స్పందించిన ఆమె బాలిక వివరాలను తెలుసుకొని కాచిగూడ పీఎస్‌లో శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆ యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పూజలో పాల్గొన్న తొలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు

## ఆలయ పునర్నిర్మాణానికి సహకారం అందిస్తా..

రాంనగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బాగ్ అంబర్‌పేటలోని మల్లన్న ఆలయ పునర్నిర్మాణా నికి తనవంతు సహకారం అందిస్తానని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ తెలిపారు. శనివా రం ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు కంచె చంద్రశేఖర్, ఆలయ కమిటీ ప్రతినిధులు సత్య నారాయణ, కృష్ణ, శ్రీనివాస్, శ్రీకాంత్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## రమాబాయి అంబేడ్కర్ అవార్డుకు భాపన్‌పల్లి రామస్వామి, భారతిల ఎంపిక

నల్లకుంట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రమాబాయి అంబేడ్కర్ 127వ జయంతి సందర్భంగా భాపన్‌పల్లి రామస్వామి, ఆయన సతీమణి భారతిలను రమాబాయి అంబేడ్కర్ అవార్డుకు ఎంపిక చేశామని అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గుడిమల్లె వినోద్‌కుమార్ వెల్లడించారు. శనివారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 7న లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్ర హం వద్ద రమాబాయి అంబేడ్కర్ అవార్డును ప్రదానం చేస్తామన్నారు.

## ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

● ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ డిమాండ్
● ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో నిరసన




ధర్నా చౌక్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కవాడిగూడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు బొజ్జసూర్యనారాయణ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాము కళాశాలలను మూసివేయాల్సి వస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో నిరసన వ్యక్తం చేశారు. వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కళాశాలల యజమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అధికారంలో వస్తే తమ న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి మోసం చేసిందని కళాశాలల యజమనులు ఆరోపించారు. కాగా, ధర్నాచౌక్ నుంచి సచివాలయం వరకు ర్యాలీగా వెళ్లేందుకు వారు ప్రయత్నించగా, అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అసోసియేషన్ నాయకులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. అనంతరం కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు పది మంది లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించేందుకు పోలీసులు అనుమతి ఇచ్చారు. దీంతో పోలీసు వాహనంలో అంబేడ్కర్ విగ్రహం వద్దకు వెళ్లి వినతి పత్రం అందజేశారు. పదిరోజుల్లో తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించకపోతే కళాశాలలను నిరవధికంగా బంద్ చేస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు బొజ్జసూర్యనారాయణ రెడ్డి వెల్లడించారు. కార్యదర్శి యాద రామకృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీధర్‌రావు, పరమేశ్వర్, కోశాధికారి శంకర్ తదితరుల పాల్గొన్నారు.

## నేటి బీసీ రాజకీయ యుద్ధభేరికి తరలిరావాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్‌లో జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరికి రాష్ట్రంలోని బీసీలందరూ తరలిరావాలని తీన్మార్‌మల్లన్న టీమ్ కన్వీనర్ బయ్య వెంకటేశ్వర్లు యాదవ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు వరంగల్ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో బారీ బహిరంగసభ జరుగుతుందన్నారు. బీసీల రాజ్యాధికారం కోసం కృషి చేస్తున్న తీన్మార్ మల్లన్న నాయకత్వాన్ని బలపరుస్తూ అధిక సంఖ్యలో జనం రావాలని కోరారు.